క్లుప్తంగా

లక్ష్యాలు చేరుకోవాలి

జడ్చర్ల టౌన్: నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో చేరుకోవాలని ఎంపీడీఓ విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో 100శాతం ఆస్తిపన్ను వసూలు చేయాలన్నారు. తాగునీటి ఎద్దడి ఎక్కడ ఏర్పడినా తక్షణమే స్పందించి పరిష్కరించాలన్నారు. నర్సరీల్లో జూన్ 1నాటికి మొక్కలు కనీసం మీటరు ఎత్తు పెరిగేలా చూడాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు ఉంటాయన్నారు. ఎంపీఓ సరోజ, ఏపీఓ విజయభాస్కర్, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇష్టపడి చదవాలి

నవాబుపేట: పదో తరగతి విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని ఎంపీడీఓ జయరాంనాయక్ సూచించారు. గురువారం ఆయన మండలంలోని కొల్లూర్ జెడ్పీ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం స్నాక్స్ అందించి వారితో మాట్లాడారు. ప్రభుత్వం ప్రత్యేకశ్రద్ధ వహించి ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు కొనసాగిస్తూ ముందుకు సాగుతుందని ఆయన వివరించారు.

హెల్త్ అసిస్టెంట్‌కు డాక్టరేట్



నవాబుపేట: హెల్త్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న శరభలింగంకు కేంద్ర, సాంస్కృతిక శాఖ డాక్టరేట్ అందించింది. ఈ సందర్భంగా ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో గురువారం సంబంధిత అధికారుల సమక్షంలో ఆయన డాక్టరేట్‌ను అందుకున్నారు. శరభలింగం నవాబుపేట పీహెచ్‌సీలో హెల్త్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ఆరోగ్య సేవలు, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, బహిరంగ మలవిసర్జన నిషేధం చాలా కార్యక్రమాలు చేపట్టారు. శరభలింగం డాక్టరేట్ పొందటంపై మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, యువజన సంఘాలు, వివిధ పార్టీల నాయకులు అభినందించారు.

పరీక్ష ప్యాడ్లు పంపిణీ

మహబూబ్‌నగర్ రూరల్: బీసీ ఐక్య సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, రాంనగర్ ఉన్నత పాఠశాల, ఎంబీసీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు గురువారం పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. దాతలు కుమ్మరి యాదయ్య ప్యాడ్లు, మంగళి నరేందర్ పెన్నులు సమకూర్చగా మానిటరింగ్ ఆఫీసర్ దుంకుడు శ్రీనివాస్ విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులు బాగా చదివి ఉత్తీర్ణులు కావాలని వారు కోరారు. పాఠశాలల హెచ్‌ఎంలు జహీరాబేగం, అంజలిదేవి, జగదీశ్వర్‌రెడ్డి, సంఘం అధ్యక్షుడు సత్యం, యాదగిరి, కె.శ్రీనివాసులు, భగవాన్, విజయ్‌కుమార్, గోవర్ధన్, సత్తయ్య, బాలరాజు గౌడ్, కొండయ్య, మాధవాచారి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

దేవరకద్ర: మండలంలోని బండర్‌పల్లి వాగు నుంచి అక్రమంగా ఇసుకను మీనుగోనిపల్లికి తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం సాయంత్రం పోలీసులు పట్టుకున్నారు. ఎలాంటి అనుమతుల్లేకుండా ఇసుకను యథేచ్ఛగా ట్రాక్టర్‌లో తరలిస్తుండగా పోలీసులు పట్టుకొని పోలీసు స్టేషన్‌కు తరలించి కేసు నమోదుచేశారు. మండలంలోని వెంకటాయపల్లి, గూరకొండ, పెద్ద రాజమూర్, వెంకంపల్లి గ్రామాల పరిధిలో ఇసుక అక్రమ రవాణా కొనసాగుతున్నది. గ్రామాల్లో ఇళ్లముందు డంప్‌లువేసి మరీ ఇసుకను టిప్పర్లద్వారా తరలిస్తున్నట్లు సమాచారం.

డ్రైవర్‌పై కేసు నమోదు

అడ్డాకుల: మండలంలోని దుబ్బపల్లి స్టేజీ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాద ఘటనలో డీసీఎం డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. కొకుంట్ల మండల కేంద్రానికి చెందిన అశోక్ తన కుటుంబంతో కలిసి గురువారం సాయంత్రం కారులో మహబూబ్‌నగర్‌కు వెళ్తున్నాడు. మార్గమధ్యలో రాచాల దాటిన తర్వాత దుబ్బపల్లి స్టేజీ సమీపంలో వెనుక నుంచి వచ్చిన డీసీఎం కారును ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఢీకొట్టింది. దీంతో కారు ధ్వంసం కాగా అందులో ఉన్న ఇద్దరికి ఎలాంటి గాయాలు కాలేదు. ప్రమాదానికి కారణమైన డీసీఎం డ్రైవర్ సుభాన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పగిడ్యాల్ వాగులో ఇసుక డంపులు సీజ్

మహమ్మదాబాద్: గండేడ్ మండలంలోని పగిడ్యాల్ వాగులో కొందరు వ్యక్తులు అక్రమంగా ఏర్పాటు చేసిన ఇసుక డంపులను మహమ్మదాబాద్ పోలీసులు గురువారం సీజ్ చేశారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు, తహసీల్దార్ నాగలక్ష్మితో అనుమతులు లేకుండా నిల్వ ఉంచిన ఇసుకను డంపును గుర్తించారు. రెవెన్యూ, పోలీసు సిబ్బంది సంయుక్తంగా దాడులు చేసి ఈ డంపులను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ బాల్‌రాజు తెలిపారు. ఇసుక అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

అసంపూర్తిగా గోదాం నిర్మాణం



అప్పంపల్లి గ్రామ ప్రాథమిక వ్యవసాయ కేంద్రం వద్ద అసంపూర్తిగా గోదాం

- నిలిచిన పనులు
- శిథిలావస్థలో వ్యవసాయ కేంద్రం గదులు
- ఇబ్బందుల్లో రైతులు

చిన్నచింతకుంట: కొకుంట్ల మండలం అప్పంపల్లి గ్రామ ప్రాథమిక వ్యవసాయ కేంద్రం వద్ద చేపట్టిన గోదాంల నిర్మాణ పనులు అధికారులు అసంపూర్తిగా వదిలేదారు. నాబార్డు నిధుల ద్వారా 2021వ సంవత్సరంలో 750 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ ఉంచేలా గోదాంల నిర్మాణం చేపట్టేందుకు అప్పటి ప్రభుత్వం రూ.45 లక్షల నిధులు మంజూరు చేసింది. కాగా పనులు అయితే ప్రారంభించారు కాని వాటిని పూర్తిచేయడంలో అలసత్వాన్ని ప్రదర్శించారు. అసంపూర్తిగా పనులు చేపట్టి వదిలేశారు. దీంతో వ్యవసాయ కేంద్రం పరిధిలోని రైతులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం ఉన్న వ్యవసాయ కేంద్రం గదులు కొన్ని శిథిలావస్థలో ఉన్నాయి. రైతులకు సబ్సిడీ కింద అందించే ఎరువులు, విత్తనాలు శిథిలావస్థలో ఉన్న గదుల్లోనే ఉంచుతున్నారు. దీంతో వర్షాకాలంలో శిథిలావస్థ గదుల్లోకి వర్షపు నీరు చేరి విత్తనాలు, ఎరువులు తడిసిన ఘటనలు సైతం ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అధికారుల గోదాంల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని పలువురు రైతులు కోరుతున్నారు.

త్వరగా పూర్తి చేయాలి



అప్పంపల్లి గ్రామ ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రం వద్ద అధికారులు గోదాం నిర్మాణం పనులు చేపట్టి మధ్యలోనే నిలిపి వేశారు. దీంతో ప్రాథమిక వ్యవసాయ కేంద్రం పరిధిలోని వివిధ గ్రామాల రైతులకు ఇబ్బందులు పడుతున్నారు. నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలి.

– కావలి రాజు, రైతు, దాసర్‌పల్లి

రైతుల ఇబ్బందులు తొలగించాలి



అప్పంపల్లి ప్రాథమిక వ్యవసాయ కేంద్రం వద్ద రైతులకు కలిగే ఇబ్బందులు తొలగించాలి. రైతులు ఎరువులు, విత్తనాలు శిథిలావస్థలో ఉన్న గదుల్లో నిల్వ చేస్తున్నారు. వర్షాకాలంలో అవి వానలకు తడిసి రైతుకు నష్టం వాటిల్లుతుంది.

– రవీందర్‌రెడ్డి, రైతు, దాసర్‌పల్లి

మహిళలకు న్యాయ సలహాలు అందిస్తాం



వేడుకలకు హాజరైన వారిని సత్కరిస్తున్న నిర్వాహకులు

- చట్టాలపై అవగాహన పెంచుకోవాలి
- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఇందిర

జడ్చర్ల టౌన్: సమాజంలో మహిళలకు అవసరమైన న్యాయ సలహాలు తాము అందిస్తామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఇందిర అన్నారు. గురువారం కావేరమ్మపేటలో జన్‌శిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో ఫెమినా మహిళా సేవా మండలి సౌజన్యంతో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. మహిళల కోసం అనేక చట్టాలు రూపొందించబడ్డాయని, వాటిపై అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు. ఆర్థికసాధికారత సాధించేందుకు టైలరింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జడ్చర్ల అదనపుకోర్టు న్యాయమూర్తి ముద్దసిర్, సఖి సెంటర్ అధికారి సౌజన్య, సీనియర్ న్యాయవాది సబియాసుల్తానా, అలియాసుల్తానా, స్వాతిరెడ్డి, మహ్మద్ అర్షద్, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కోదండరాంకు ఘనస్వాగతం



దేవరకద్ర: మండల కేంద్రంలో ఓ కార్యక్రమానికి గురువారం ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరాం హాజరయ్యారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షులు చంద్రయ్య, మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు హరికాంత్ ఆయనకు ఘన స్వాగతం పలికారు.

ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభం



జడ్చర్లలో పరీక్షలు రాసి బయటకొస్తున్న విద్యార్థులు

జడ్చర్ల టౌన్: ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభయ్యాయి. ఉదయ మెమోరియల్‌హైస్కూల్ కేంద్రంలో 129 మంది విద్యార్థులకు 5మంది గైర్హాజరయ్యారు. విశ్వవికాస్ కళాశాలలో 361మందికి 12మంది, బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 259మందికి 3గురు, కోఎడ్యుకేషన్ కళాశాలలో 203మందికి 8మంది, ఐవీరెడ్డి కళాశాలలో 132కు ముగ్గురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. జడ్చర్లలోని వివిధ పరీక్షకేంద్రాల్లో 31మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

12 మంది విద్యార్థులు గైర్హాజరు

దేవరకద్ర: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్ పరీక్ష కేంద్రంలో గురువారం జరిగిన ఇంటర్ సెకండియర్ పరీక్షలకు 291 మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం 303 మంది విద్యార్థులకు గాను 12 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



స్టేషన్ మహబూబ్‌నగర్: విద్యార్థులు పట్టుదలతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని మైనార్టీ గురుకులాల ఆర్‌ఎల్‌సీ ఖాజా బావుద్దీన్ అన్నారు. జిల్లా కేంద్రం భగీరథకాలనీలోని మైనార్టీ బాలికల గురుకులం-1లో పదో తరగతి విద్యార్థుల ప్రీఫైనల్ పరీక్షలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతున్న రానున్న పదో తరగతి వార్షిక పరీక్షల్లో గురుకుల విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రణాళికాబద్ధంగా చదవాలన్నారు. ప్రిన్సిపాల్ లక్ష్మి పాల్గొన్నారు.

అహల్యబాయి జీవితం ఆదర్శం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: రాజమాత అహల్యబాయి హోల్కర్ జీవితం నేటితరానికి ఆదర్శమని పీయూ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డా.డి.మధుసూదన్ రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని శ్రీవాసవి డిగ్రీ, పీజీ కళాశాలలో అహల్యబాయి జయంతిని ఏబీఆర్‌ఎస్‌ఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అహల్యబాయి జీవిత చరిత్ర నేటితరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. పీయూ ప్రొఫెసర్ డా.రాజశేఖర్, కళాశాల ప్రిన్సిపాల్ కొండస్వామి తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర కిట్లు అందజేత



దేవరకద్ర: మండలంలోని కోయిల్‌సాగర్ గ్రామంలో గురువారం గుంజ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 50మంది నిరుపేదలకు నిత్యావసర కిట్లను పంపిణీ చేశారు. ఒక్కో కుటుంబానికి కావాల్సిన సరుకుల కిట్లను కాంగ్రెస్ నాయకుడు చందుగౌడ్ అందజేశారు.

ఘనంగా స్వయం పాలన దినోత్సవం



పాఠాలు బోధిస్తున్న విద్యార్థులు

నవాబుపేట: మండలంలోని దొడ్డిపల్లి పాఠశాలలో స్వయం పాలన దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులైన తోటి విద్యార్థులకు బోధన చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి నాగ్యనాయక్, సీఆర్‌పీ జనార్దన్, హెచ్‌ఎం గంగాధర్, బానుప్రసాద్, యాదిలాల్‌జీ, పాఠశాల చైర్మన్ మశ్లీశ్వరీ, మాజీ సర్పంచ్ రాములు, యాదయ్య, బాల్‌రాజ్ తదితరులు ఉన్నారు.

విద్యార్థినికి అభినందనలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని న్యూరిషి స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి బిందుశ్రీ చిత్రలేఖన పోటీల్లో రాష్ట్రస్థాయి లో మొదటి బహుమతి సాధించింది. గురువారం విద్యార్థినిని పాఠశాల యాజమాన్యం అభినందించారు. చైర్మన్ చంద్రకళా వెంకటయ్య, పూజితా మోహన్‌రెడ్డి, శిరీషప్రవీణ్‌కుమార్, సాయి సుశాంత్‌కృష్ణ, ప్రిన్సిపాల్ వెంకటరమణ, ఇన్‌చార్జి మాలతి పాల్గొన్నారు.

రాఘవేంద్రస్వామి మఠంలో ప్రత్యేకపూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

జడ్చర్ల టౌన్: రాఘవేంద్రస్వామి జయంతి పురస్కరించుకొని మున్సిపాలిటీ పరిధిలోని రాఘవేంద్ర మఠంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి పంచామృతాభిషేకం, అలంకరణ, డోలాహరణం జరిపించారు. భజనలు, కీర్తనలు ఆలపించారు. వేడుకలకు రాష్ట్ర సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ బి.శివకుమార్, పట్టణ వాసులు మంచన విఠలయ్య, పెద్దిపెంటయ్య పాల్గొన్నారు.

ఒరిగిపడితే ప్రమాదమే

ఆందోళన చెందుతున్న జనం



ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం

అడ్డాకుల: మూసాపేట మండలం పోల్కంపల్లి నుంచి ఖిల్లాఘనపురం వైపు వెళ్లే దారిలో గుంపులో గట్టు సమీపంలో బీటీరోడ్డు పక్కన ఉన్న వ్యవసాయ పొలంలో విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది. పొలంలో స్తంభాన్ని పాతిన చోట మాత్రమే మట్టి ఎత్తుగా ఉంది. దాని చుట్టు మట్టి కిందికి ఉండటంతో స్తంభం ఒకవైపు ఒరిగిపోయి కిందపడేలా ప్రమాదకరంగా కనిపిస్తోంది. ఈదురు గాలి వీస్తే కిందపడేలా ఉన్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడంలేదు. రోడ్డు పక్కనే ఉన్న స్తంభం రోడ్డుపై వెళ్లే ప్రయాణికులపై పడే అవకాశం ఉంది. అధికారులు ఒరిగిన స్తంభాన్ని సరిచేయాలని రైతులు కోరుతున్నారు.



సమస్యలపై చర్చ జరిగేనా..?

- దృష్టిసారించని అధికారులు, ప్రజా ప్రతినిధులు
- ఆధిపత్యం కోసం పాకులాడుతున్న కౌన్సిలర్లు
- నేడు కౌన్సిల్ సమావేశం

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ కార్యాలయంలో శుక్రవారం జరగనున్న కౌన్సిల్ సమావేశంలోనైనా సమస్యలపై చర్చ జరిగేనా అన్న సందేహాలు నెలకొన్నాయి. సమస్యలపై అధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టి సారించకపోవటంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గతవారం జరిగిన మున్సిపల్ బడ్జెట్ సమావేశంలో అదనపు కలెక్టర్ అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించినా ఎలాంటి మార్పు లేకపోవటం గమనార్హం. బడ్జెట్ సమావేశంతో పాటే కౌన్సిల్ సమావేశం జరగాల్సినప్పటికీ నిధుల కేటాయింపులో తమకు అన్యాయం జరిగిందని కొందరు కౌన్సిలర్లు అభ్యంతరం చెప్పటంతో వాయిదా పడింది. మున్సిపాలిటీలో ప్రధానంగా నడుస్తున్న చర్చ అక్రమనిర్మాణాలు. వాటిపై చర్యలు తీసుకోవాలని స్వయంగా అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ సైతం ఆదేశాలు జారీ చేశారు. అయినా ఆయన ఆదేశాలు ఏ మాత్రం అమలు చేయకుండా ఉన్నారు. నిర్మాణదారులకు నోటీసులు జారిచేసి చేతులు దులుపుకున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వేసవి ప్రారంభమైనా కమిషనర్, ఇతర అధికారులు వార్డుల్లో పర్యటించటంలేదు. దీనికితోడు కౌన్సిలర్లు తమ ఆధిపత్యం కోసం పాకులాడుతుండటంతో సమస్యలు ఎక్కడికక్కడే పేరుకుపోతున్నాయి. కుక్కల బెడద తీరకపోగా పందుల సమస్య రోజురోజుకు అధికమవుతుంది. 44వ నంబర్ జాతీయరహదారిపై మురికినీరు వరదలా పారుతున్నా అటు హైవేఅధికారులు, ఇటు మున్సిపల్ సిబ్బంది పట్టించుకోవడం లేదు. మురికినీరు సర్వీస్‌రోడ్డుపై పారుతూ హైవేపైకి వస్తున్నాయి. హౌసింగ్‌బోర్డు మొదలు నిమ్మబావిగడ్డ వరకు, ఇటు ఏరియా ఆస్పత్రివరకు ఫుట్‌పాత్ పూర్తిగా ఆక్రమణలకు గురైంది. మున్సిపాలిటీ పరిధిలోని 3, 12 వార్డుల్లో హైవే విస్తరణ పనులు నత్తనడకన నడుస్తున్నాయి. దుమ్ము, ధూళితోప్రజలు సతమతమవుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సంబంధం లేనట్లు వ్యవహరిస్తుండటంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఈ సమస్యలపై కౌన్సిల్ సమావేశంలో చర్చించి నిర్ణయాలు తీసుకుంటారా షరామామూలుగా ముగిస్తారో వేచి చూడాల్సిందే.

మురుగునీటిని మళ్లించాలని వినతి



ఎంపీ డీకే అరుణకు వినతిపత్రం అందజేస్తున్న హస్నాపూర్ గ్రామ రైతులు

భూత్పూర్: మండలంలోని తాటికొండ గ్రామ సమీపంలోని వీరన్న చెరువుకు వచ్చే మురుగునీటిని మళ్లించాలని ఎంపీ డీకే అరుణకు హస్నాపూర్ గ్రామ రైతులు వినతిపత్రం సమర్పించారు. జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో ఎంపీని కలిశారు. తాటికొండ వీరన్న చెరువుకు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని మురుగునీరంతా చేరుతుందని వారు ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. మహబూబ్‌నగర్ నుంచి వచ్చే నీటిని మళ్లించాలని, తమకు ప్రభుత్వ భూమినైనా ఇవ్వాలని హస్నాపూర్ రైతులు వివరించారు. రైతులు నరసింహ మనోహర్, ఆర్.శంకర్, విజయకుమార్, బి. ఆంజనేయులు, శివ, శివకుమార్ ఉన్నారు.

ఎమ్మెల్సీల గెలుపుతో బీజేపీ సంబురాలు



మహబూబ్‌నగర్‌లో స్వీట్లు తినిపించుకుంటున్న బీజేపీ నాయకులు

సాక్షి నెట్‌వర్క్: ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కొమురయ్య గెలుపొందిన సందర్భంగా గురువారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయం వద్ద బాణాసంచా కాల్చి స్వీట్లు పంచుకున్నారు. జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, పద్మజారెడ్డి,రాములు, కృష్ణవర్ధన్‌రెడ్డి, రమేష్, కిరణ్, యాదయ్య, రాజేందర్‌రెడ్డి, దర్పల్లి హరికృష్ణ పాల్గొన్నారు.

- మహమ్మదాబాద్‌లో బీజేపీ మండలాధ్యక్షుడు మూస నర్సింహా ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు కేశవులు, కృష్ణ, రామ్‌రెడ్డి, కాశీనాథ్, జయవర్ధన్ రెడ్డి, సత్యనారాయణ్‌రెడ్డి, వంశీ పాల్గొన్నారు.
- దేవరకద్రలో బీజేపీ మండలాధ్యక్షుడు కృష్ణంరాజు ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు. రాచాల రాజు, దేవన్న, అమరేందర్‌రెడ్డి, నాగిరెడ్డి, సత్యనా రాయణ, అశోక్, నరహరి శేఖర్, అరుణ్, గణేశ్, అరవింద్ పాల్గొన్నారు.



మహమ్మదాబాద్‌లో..



దేవరకద్రలో..

పైప్‌లైన్ లీకేజీ మరమ్మతు



మరమ్మతు పనులు పరిశీలిస్తున్న కౌన్సిలర్, వాటర్ సిబ్బంది

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని పాతబజార్ గాంధీచౌక్ వద్ద పైప్‌లైన్ లీకేజీ కారణంగా 23వ వార్డులో నీటి సమస్య తలెత్తటంతో గురువారం మున్సిపాలిటీ సిబ్బంది లీకేజీని సరిచేశారు. వారం రోజుల క్రితం పైప్‌లైన్ కోసం తవ్వి వదిలేశారు. దీంతో 23వ వార్డులో నీటిసరఫరా లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఇదే ప్రాంతంలో తరచూ పైప్‌లైన్ లీకేజీ సమస్యలు ఏర్పడుతున్నాయి. దీంతో వార్డు కౌన్సిలర్ ఉమాశంకర్‌గౌడ్ కమిషనర్ లక్ష్మారెడ్డికి ఫిర్యాదు చేశారు. నీటి సమస్య తలెత్తుతున్నందున లీకేజీని వెంటనే సరిచేయించి నీటి సరఫరా చేయించాలని కోరారు. దీంతో మున్సిపల్ సిబ్బంది మరమ్మతులు చేసి నీటి సరఫరాను పునరుద్ధరించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



చిన్నచింతకుంట: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని రామ్ లాల్‌నాయక్ సూచించారు. గురువారం మండలంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితాలను కోల్పోతారని సూచించారు. విద్యపై దృష్టిసారించి ఉన్నత స్థానాలకు చేరి తల్లిదండ్రులకు, స్కూల్‌కు మంచిపేరు తీసుకురావాలన్నారు. మానవ హక్కుల కమిషన్ కమిటీ సభ్యుడు బషీర్, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు ఉన్నారు.